నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA



నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# విద్య, వైద్యానికి పెద్దపీట

- వరంగల్‌ను హెల్త్‌హబ్‌గా మారుస్తాం
- త్వరలో రూ.30కోట్లతో క్యాన్సర్ ట్రామా సెంటర్ ఏర్పాటుచేస్తాం
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రులు

నర్సంపేట రూరల్, సెప్టెంబర్19 : రాష్ట్ర ప్రభుత్వం వైద్య, విద్యరంగాలకు పెద్దపీట వేసిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం నర్సంపేటలో నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, సమాచార, పౌర సంబంధాలు, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యంగా విద్య, వైద్యం అయి ఉండాలని, అవి అమలుచేసే దిశగా రేవంత్ సర్కారు నిరంతరం కృషి చేస్తుందన్నారు. రూ.183 కోట్ల నిర్మాణ వ్యయంతో నర్సంపేట వైద్య కళాశాలను, రూ.66కోట్ల నిధులతో జనరల్ ఆస్పత్రిని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం 50 సీట్లతో ఈ ప్రాంతవాసులు వైద్యసేవలకు సంపూర్ణంగా వినియోగించుకునే లాగా అందుబాటులోకి తీసుకొచ్చామని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లావాసులు అత్యవసర సమయంలో హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా అత్యాధునిక అంబులెన్స్‌లు, ట్రామా సెంటర్లు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్, ఐవీఎఫ్ సెంటర్, పీడియాట్రిక్ సెంటర్, క్యాన్సర్ సెంటర్ లాంటి సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలన్నీ రానున్న రోజుల్లో అందుబాటులోకి తీసుకొచ్చి వరంగల్‌ను హెల్త్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. త్వరలో వరంగల్‌లో రూ.30కోట్లతో క్యాన్సర్ ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే 7వేల మందికి నర్సింగ్ పోస్టులు ఇచ్చి త్వరలో ఇంకో 2500మందికి పోస్టింగ్ ఇచ్చే దిశగా నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాలలోని అన్ని విభాగాలను, బ్లాక్‌లను, బ్లడ్ బ్యాంక్, సెంట్రల్ ల్యాబ్‌లను వారు పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు.

**ఇవ్వని హామీలూ నెరవేరుస్తాం: మంత్రి పొంగులేటి**

నర్సంపేట మెడికల్ కళాశాల తరగతులు త్వరలో ప్రారంభమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలుచేస్తామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి సుమారు రూ.657 కోట్లను ఖర్చు పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. రూ.100 కోట్లతో 25ఎకరాల్లో అన్ని కులాలు, అన్ని వర్గాలకు సంబంధించిన హాస్టల్స్, స్కూల్స్ ఉండేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేవలం 27రోజుల్లో 23లక్షల మందికి రూ.18వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశామని, సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని, వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతీ రైతన్నకు రుణమాఫీ చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.31వేల కోట్ల రూపాయలకు ఇంకా కావాలంటే రూ.300కోట్లు ఎక్కువైనా పర్వాలేదని అర్హులైన రైతులకు రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని స్పష్టంచేశారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికీ హెల్త్‌కార్డులు, రేషన్‌కార్డులు వేర్వేరుగా ఇస్తామని, త్వరలో ఇందిరమ్మ ఇండ్లకు కూడా ముగ్గు పోస్తామని మంత్రి ప్రకటించారు.

**నిరుపేదలకు మెరుగైన వైద్యం : మంత్రి కొండా సురేఖ**

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం కృషిచేస్తుందని, మారుమూల ప్రాంతంలో వైద్య కళాశాలను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. మహిళలను ఆర్థిక, సాధికారతతో ముందుకు తీసుకువెళ్తున్న ఘనత ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. ఖమ్మం నుంచి కూడా వైద్య సదుపాయాల కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు వస్తున్నారని పేర్కొన్నారు. నర్సంపేట కొత్త ఆస్పత్రిని ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించడం వల్ల రోగులకు మనశ్శాంతిగాతో పాటు వ్యాధి నుంచి కోలుకునే శక్తి కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మహబూబాబాద్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు మురళీనాయక్, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మెడికల్ కళాశాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, జిరాక్స్, స్టేషనరీ, జనరల్ స్టోర్స్‌లను మంత్రులు ప్రారంభించారు. 15 స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల విలువైన చెక్కులు అందజేశారు. రాజుపేట శివారు నర్సంపేట-కొత్తగూడ ప్రధాన రహదారిలో రూ.2కోట్లతో బంజారా భవన్, అమృత్ పథకంలో భాగంగా రూ.31కోట్లతో వాటర్‌ట్యాంక్, అంతర్గత పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, అగ్రికల్చర్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కలెక్టర్ సత్యశారద, డీఎంఈ వాణి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవిందర్, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, జడ్పీ సీఈవో రాంరెడ్డి, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, తహసీల్దార్ రాజేశ్, మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజిని-కిషన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కిషన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు.

- అరుణ వర్ణం.. చెరువుకు కొత్తందం



సూర్యాస్తమయ వేళ చెరువంతా అరుణ వర్ణంతో మెరిసిపోయింది. దూరాన ఉన్న కొండల నుంచి జారుకుంటున్న భానుడు.. మెరిసేటి అలలతో ములుగు సమీపంలోని తోపుకుంట చెరువు చెంత కొంగొత్త దృశ్యం ఆవిష్కృతమైంది. - ములుగు ఫొటోగ్రాఫర్




జనగామ పోలీసుల అదుపులో సీపీఎం, రైతు సంఘం నాయకులు



# అన్నదాతల నిర్బంధం

**రుణమాఫీ కోసం రైతుల పోరు**

**ప్రతి పీఎస్ పరిధిలో అరెస్టులు**

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కట్టడి
- కాంగ్రెస్ సర్కారుపై కర్షకుల ఆగ్రహం

వరంగల్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రుణమాఫీ కోసం పోరుబాట పట్టిన అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధించింది. అందరికీ అన్నం పెట్టే రైతులను పోలీస్‌స్టేషన్లలో బంధించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా ఎలాంటి షరతులు లేకుండా పంట రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో అన్నదాతలు గురువారం చలో ప్రజాభవన్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని సగం మందికి పైగా రైతులకు రుణమాఫీ చేయని రేవంత్ సర్కారు.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మరిచి రైతులపై నిర్బంధ చర్యలు మొదలుపెట్టింది. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసిన రైతులను అక్రమంగా అరెస్టులు చేసింది. ప్రజాభవన్ కార్యక్రమానికి వెళ్తారనే అనుమానం ఉన్న ప్రతి రైతును పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచే కట్టడి చేసింది. వరంగల్ పోలీస్ కమిషరేట్, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి కనీసం 10మందికి తగ్గకుండా రైతులను పోలీసులు అరెస్టులు చేశారు. రాత్రివేళ ఇళ్లకు వెళ్లి మరీ అదుపులోకి తీసుకోవడంపై కర్షకుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రతిరోజు పంట పొలాల వద్దకు వెళ్లే రైతులు ఇలా కాంగ్రెస్ సర్కారు తీరులో పోలీస్‌స్టేషన్ వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

## ఉమ్మడి జిల్లాలో సగం మందికి కూడా మాఫీ కాలే..

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఆ పార్టీ ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ పథకం వర్తించలేదు. రైతులకు లబ్ధి చేకూర్చడం కాకుండా పంట రుణాలు మాఫీ చేస్తే అయ్యే ఖర్చును తగ్గించేలా తిరకాసు పెట్టింది. రుణాలు తీసుకున్న వారి వివరాలు సేకరించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో సగం మంది రైతులకు కూడా రుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం మొదట ప్రకటించిన లక్ష రూపాయల్లోపు రుణాల మాఫీకి అర్హులైన వారికి లబ్ధి కలగలేదు. రెండో దశ రుణమాఫీ ప్రక్రియలోనూ ఇదే జరిగింది. రుణమాఫీ కోసం రైతులు బ్యాంకర్లను, అధికారులను అడిగినా ఫలితం లేకుండా పోయింది. సహకార సంఘాల్లో రుణమాఫీ పూర్తిగా అయోమయంగా మారింది. ఈ నేపథ్యంలో ఎలాంటి షరతులు లేకుండా పంట రుణాలను మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా ఎక్కడిక్కడ నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. రైతుల నిరసనతో రాష్ట్ర సర్వే పేరుతో కాలయాపన చేసింది. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులకు వివరాలను, కుటుంబ ఫొటోలు ఇవ్వాలని సూచించింది. ఈ సర్వే పేరుతో రెండు వారాలు సాగదీసింది. సర్వే పూర్తయినా అర్హులైన రైతులకు పంట రుణాల మాఫీపై ఎలాంటి ప్రకటన చేయడంలేదు. రుణాలు మాఫీ కాని రైతులు ఆవేదనతో నిరసన కార్యక్రమం చేపట్టారు. తాజాగా చలో ప్రజాభవన్ నిర్వహించాలని నిర్ణయించగా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం విధించింది. కార్యక్రమానికి వెళ్లేవారితోపాటు పొలాలకు వెళ్లే వారినీ పోలీస్‌స్టేషన్లలో, వారి ఇళ్లలో నిర్బంధించింది.



చిల్పూరులో రైతులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



ములుగు పీఎస్ వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

## సారీ.. జెండా రిపేర్‌లో ఉంది



జెండా లేకుండా వెలవెలబోతున్న మహబూబాబాద్ కలెక్టరేట్




అండర్ మెయింటనెన్స్ అని పెట్టిన బోర్డు

సకల హంగులతో అత్యద్భుతంగా నిర్మితమైన మహబూబాబాద్ జిల్లా సమీకృత కార్యాలయ భవనం ముందు త్రివర్ణ పతాకం రెపరెపలాడుతూ కలెక్టరేట్ నిత్యం కళకళలాడేది. 25 అడుగుల ఎత్తులో ఎగిరే మూడు రంగుల జెండా అక్కడికి వచ్చే వారిలో జాతీయభావం పెంపొందించేది. కానీ గత 20రోజుల నుంచి ఇక్కడున్న స్తంభం జాతీయ పతాకం లేక వెలవెలబోతోంది. దీనికి తోడు 'అండర్ మెయింటనెన్స్' అని బోర్డు తగిలించి చేతులు దులుపుకొన్నారు. అయితే ఇన్ని రోజులవుతున్నా మరమ్మతు చేయించి జెండా కట్టేంత సమయం కూడా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్ జిల్లా

## చిన్నారిని బలిగొన్న విషజ్వరం

- నెల రోజులుగా మృత్యువుతో పోరాటం
- అంబులెన్స్ లేక పాట్లు
- మానవత్వం కనబర్చిన బీఆర్ఎస్ నాయకుడు జంపన్న



గీతిక(ఫైల్)

ఏటూరునాగారం/వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 19 : ఏటూరునాగారంలోని ఆకులవారి ఘనపూర్‌కు చెందిన కంకణాల శ్రీకాంత్ కుమార్తె గీతిక(6) జ్వరంతో మృతి చెందింది. ఆగస్టు 15న జ్వరం రావడంతో స్థానికంగా ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స చేయించినా తగ్గకపోవడంతో సెప్టెంబర్ 1న ఎంజీఎంలో చేర్పించారు. 19 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శ్రీకాంత్ కుమారుడు సాత్విక్ కూడా జ్వరంతో బాధపడుతున్నాడు. కుమార్తె చికిత్స కోసం రూ.70వేలకు పైగా ఖర్చు చేసి నెల రోజులకు పైగా కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇదిలా ఉంటే ఎంజీఎం నుంచి బాలిక మృతదేహాన్ని ఇంటికి తేవడానికి పార్థివదేహాన్ని తరలించే ప్రభుత్వ వాహనం మూడు గంటలైనా రాలేదు. ప్రైవేట్ అంబులెన్స్‌కు వెచ్చించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేత భూక్యా జంపన్న అంబులెన్స్ సమకూర్చారు. గొప్పలు చెప్పుకునే ఈ ప్రభుత్వం కనీసం శవాలు తరలించే అంబులెన్స్ ఏర్పాటుచేయకపోవడం సిగ్గుచేటని అసంతృప్తి వ్యక్తం చేశారు.

## నాడు తండ్రి.. నేడు తల్లి మృతి

- 3 నెలల వ్యవధిలోనే ఇద్దరు మృతి
- వ్యవసాయంలో నష్టం వచ్చి అప్పుల బాధతో తల్లి ఆత్మహత్య
- అనాథలైన ఇద్దరు కుమారులు
- గార్లగడ్డతండాలో చోటుచేసుకున్న సంఘటన



పాల్తీయ భద్రమ్మ(ఫైల్)

నర్సంపేట రూరల్, సెప్టెంబర్19: నాడు తండ్రి...నేడు తల్లి మృతి చెందడంతో ఇద్దరు కుమారులు అనాథలుగా మారిన ఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ పంచా యతీ పరిధిలోని గార్లగడ్డతండాలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన పాల్తీయ వీరన్న(50),భద్రమ్మ (42)లకు ఇద్దరు కుమారులు. వీరికి మూడెకరాల భూమి ఉంది. దీనికి తోడు మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశారు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల కోసం రూ.12 లక్షల వరకు అప్పు చేశారు. 3 నెలల క్రితం వీరన్న గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారంతోపాటు పంట నష్టం, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 17న ఇంట్లో ఎవరూ లేని సమయంలో భద్రమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు అదేరోజు దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మూడు నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కోరుతున్నారు.

## కాంపిటెంట్ అథారిటీ కోటా కింద ఎండీఎస్ అడ్మిషన్లు

వరంగల్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): న్యూఢిల్లీలోని మెడికల్ సైన్సెస్‌లో నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) ప్రకారం కాంపిటెంట్ అథారిటీ కోటా కింద అడ్మిషన్ల కోసం నీట్-ఎండీఎస్ 2024లో అర్హత పొందిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోరు తున్నట్లు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆర్మీ డెంటల్ కళాశాలలో ఈ కోటా సీట్లలో మాత్రమే అడ్మిషన్ కోసం స్టేట్ మెరిట్ పొజిషన్ ను అప్‌డేట్ చేయడానికి వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొ న్నారు. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి మొత్తం ఖాళీ సీట్ల సంఖ్య, కౌన్సెలింగ్ కోసం వెబ్ ఆప్షన్లను అమలు చేయడానికి ముందు కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ వెబ్‌సైట్‌లో తెలియజేస్తారని వివరించారు. అలాగే ఎండీఎస్ కో ర్సుల కోసం అభ్యర్థులు నీట్-ఎండీఎస్ 2024లో కటాఫ్ స్కోర్ లేదా అంతకంటే ఎక్కువ సాధించి ఉండాలని, ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 20న ఉదయం 8 నుంచి 22 సా యంత్రం 6 గంటల వరకు వెబ్‌సైట్‌లో స్కాన్ చేసిన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

## బాలికపై లైంగికదాడి

**నిందితుడిపై పోక్సో కేసు నమోదు**

ఐనవోలు, సెప్టెంబర్ 19 : ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసు నమోదైంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పున్నేల్ హాబిటేషన్ వడ్డెరగూడేనికి చెందిన అలకుంట్ల మధు అదే గ్రామానికి చెందిన బాలిక తన ఇంటి దగ్గర పని చేసుకుంటుండగా ఇంటికి రమ్మని పిలిచాడు. ఆపై బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అలకుంట్ల మధుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎంజీఎంలో నిలిచిన పారా మెడికల్ సేవలు

**ల్యాబ్‌లో పరికరాలు లేక రెండు గంటలు ఆగిపోయిన నమూనాల సేకరణ**

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 19: ఎంజీఎం దవాఖానలో అధికారుల నిర్లక్ష్యంతో పారా మెడికల్ సేవలు కొద్దిసేపు నిలిచిపోయాయి. గురువారం సెంట్రల్ ల్యాబ్ (రూమ్ నంబర్ 47)లో పరికరాల కొరత కారణంగా నమూనాల సేకరణ ఆగిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు రెండు గంటల అనంతరం పరికరాలు అందుబాటులోకి రావడంతో సేవలు కొనసాగించారు. దీనికి ఉద్యోగులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడమే కారణమని రోగులు, అటెండెంట్లు ఆరోపించారు.

## అద్దె చెల్లించరు.. నిబంధనలు పాటించరు

- ఎంజీఎంలో అద్దె షాపులన్నీ అక్రమమేనని నిర్ధారించిన కమిటీ
- అనుమతులు ఒక పేరుతో నిర్వహణ మరొకరి పేరుతో
- తనిఖీల్లో విస్తుపోయే నిజాలు



ఎంజీఎంలో ఏర్పాటు చేసిన అద్దె షాపుల అనుమతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇక్బాల్

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్19: ఎంజీఎం దవాఖాన ఆవరణలోని షాపులకు అద్దె చెల్లించక, నిబంధనలు పాటించక కొందరు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎంజీఎం దవాఖానను సందర్శించిన సంద ర్భంలో అద్దె గదుల విషయంలో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో కలెక్టర్ సత్యశారద వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్, మట్టెవాడ పోలీస్ అధికారి, మున్సిపల్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. అందులో భాగంగా గురువారం కమిటీ తనిఖీలు నిర్వహించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ముఖ్యంగా అమృత్ ఫార్మసీ పేరుతో ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపులో 2020 సంవత్సరం వరకు మాత్రమే మందులకు అనుమతులు న్నాయని, నాలుగేళ్లుగా అనుమతులు లేకుండానే కొనసాగిస్తున్నారని తేలింది. 2023లో ఎంజీఎం సూపరింటెండెంట్ నోటీస్ జారీ చేసినప్పటికీ ఖాళీ చేయకుండా అమ్మకాలు జరుపుతున్నారని, మరో వ్యక్తి పాల అమ్మకాల కోసం అనుమతులు తీసుకొని, కూల్‌డ్రింక్స్ అమ్మకాలు జరుపుతున్నట్లు, టెలిఫోన్ బూత్ పేరుతో అనుమతులు తీసుకొని హోటల్స్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 13 షాపుల నిర్వహణలో పూర్తిగా నిబంధనల అతిక్రమణ జరిగిందని, అందుకు సంబంధించిన నివేదికను షాపుల వారీగా నివేదికను తయారు చేసి కలెక్టర్‌కి అందిస్తామని కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

## డాన్‌గా ఎదగాలని దాడులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం

- జైలుకు వెళ్లొచ్చినా మారని స్నేహితులు
- ఉర్సులో రైతుపై దాడి చేసిన ఇద్దరు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాం

ఖిలావరంగల్, సెప్టెంబర్ 19: డాన్‌గా ఎదగాలని ప్రజలను భయభ్రాంతులకు గురిచే స్తూ.. కారణం లేకుండా దాడులకు తెగబడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మిల్స్‌కాలనీ పీఎస్‌లో వరంగల్ ఏసీపీ నందిరాం నిందితుల వివరాలు వెల్లడించా రు. కరీమాబాద్ బీఆర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మల్లికార్జున్ అలియాస్ మల్లేశ్, భూ పాలపల్లి రేగొండకు చెందిన గడ్డం సంపత్ అలియాస్ ప్రశాంత్ స్నేహితులు. వీరు కాశీబుగ్గలో ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీన బీఆర్ నగర్‌లో వీరు రైతుపై ఉమ్మి వేయగా ప్రశ్నించినందుకు అతడిని కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులిద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో వీరిపై ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో మర్డర్, తదితర కేసులు నమోదైనట్లు ఏసీపీ వివరించారు. మల్లికార్జున్ 2004లో మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని చంపి 11 ఏళ్లు జైలు జీవితం అనుభవించాడు. ఇతడిపై గతంలో గీసుగొండ పోలీసు స్టేషన్‌లో ఆయుధాలు కలిగి ఉన్న కేసు నమోదైంది. గడ్డం సంపత్ 2018లో మేడారం జాతరలో మర్డర్ చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. అలాగే వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు కొట్టుకున్న కేసులు, నల్గొండ వన్‌టౌన్ స్టేషన్‌లో హత్యాయత్నం, ఇంతెజార్‌గంజ్ స్టేషన్‌లో కొట్టుకొన్న కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు. 2107లో సుబేదారి పీఎస్, 2018లో హసన్‌పర్తిలో పీఎస్‌లో కొట్టుకున్న కేసులు, గతేడాది డిసెంబర్ 31వ తేదీన బీఆర్‌నగర్‌లో గిరబోయిన మహేందర్‌ను ఇద్దరు కలిసి కత్తితో పొడిచిన కేసులో జైలు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. కార్యక్రమంలో సీఐ పీ మల్లయ్య ఉన్నారు.